# పడకేసిన.. ప్రక్షాళన



- ఎడారిని తలపిస్తున్న భద్రకాళి చెరువు
- అంతంత మాత్రంగానే పూడికతీత
- ఎక్కడి గుర్రపుడెక్క అక్కడే
- మత్స్యకారుల జీవనోపాధి కరువు
- డైవర్ట్ కాని మురుగు నీరు



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఒకప్పుడు ఓరుగల్లు ప్రజల దాహార్తిని తీర్చిన భద్రకాళి చెరువు ఇప్పుడు సమ్మర్ స్టోరేజీ జలాశయంగా మారింది. గతంలో 560 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ జలాశయంలో ప్రస్తుతం 382 ఎకరాలు మాత్రమే మిగిలి ఉంది. సుమారు 180 ఎకరాల మేర ఆక్రమణలకు గురైంది. దీంతో మిగిలిన చెరువును పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చొరవతో చెరువు ప్రక్షాళనకు వేగంగా అడుగులు పడ్డాయి. చెరువులో పూడిక తీసి జలాశయాన్ని శుద్ధి చేయాలని ప్రభుత్వం భావించింది. అందులో భాగంగానే బౌండరీస్ ఫిక్స్ చేయాలని నిర్ణయించింది. బోటింగ్ ఏర్పాటు చేయడంద్వారా పర్యాటకులను మరింతగా ఆకట్టుకోవచ్చని ప్రణాళికరు రూపొందించారు.

## పనులు అంతంత మాత్రమే..

నీటితో కలకలలాడే భద్రాకాళి జలాశయం నేడు చుక్క నీరు లేక వెలవెలపోతోంది. పూడిక తీత పనులు కూడా అంతంత మాత్రంగానే జరగడంతో ఆశించిన మేర ప్రయోజనం లేకుండా పోయింది. భద్రకాళి దేవాలయం పరిసర ప్రాంతాల్లో కొంత మట్టి తీసినట్లు కనిపించినా చెరువులోని చాలా ప్రాంతాల్లో తట్ట మట్టి కూడా ఎత్తలేదు. అదే విధంగా చెరువులోని నీటినంతా దిగువకు విడుదల చేయడంతో చెరువు నిండా ఉన్న గుర్రపు డెక్క ఎక్కడిదక్కడే మిగిలిపోయింది. వేసవి కాలంలో అది పూర్తిగా ఎండి పోయింది. ప్రస్తుతం కురుస్తున్న చినుకులతో ఎండిపోయి గుర్రపు డెక్ మళ్లీ చిగురిస్తుంది. చెరవులోకి నీరు వచ్చే చేరగానే దాని విశ్వరూపాన్ని ప్రదర్శించే అవకాశం ఉంది. చినుకులు పడి వర్షపు నీరు చెరువులోకి చేరకముందే గుర్రపు డెక్కను తొలగించడం ద్వారా ప్రయోజనం చేకూరుతుందన్న భావన వ్యక్తం అవుతోంది.

## పెరగనున్న నీటి నిలువ సామర్థ్యం..

భద్రకాళి చెరువు పూర్తి నీటి సామర్థ్యం 150 మెట్రిక్ క్యూబిక్ ఫీట్లు. సహజంగా 132 మెట్రిక్ క్యూబిక్ ఫీట్లకు నీరు చేరితే మత్తడి పోస్తుంది. ఎగువన జూ పార్క్ నుంచి వచ్చే మురికినీటి కాలువ, సీఎస్ఆర్ గార్డెన్ నుంచి వచ్చే మరో మురికి నీటి కాలువ, బొందివాగు నాలా, శాయంపేట సర్కిల్ ప్రాంతంలోని నీరంతా భద్రకాళి చెరువులోనే కలుస్తుంది. చెరువులో ఒక మీటర్ డెప్త్ తో ఒక లేయర్ మట్టి తొలగిస్తే ఇప్పుడున్న నీటి సామర్థ్యానికంటే అదనంగా 50 మెట్రిక్ క్యూబిక్ ఫీట్స్ పెరుగుతుందని ఇరిగేషన్ అధికారులు భావించారు. తద్వారా భద్రకాళి చెరువు నీటి సామర్థ్యం 150 మెట్రిక్ క్యూబిక్ ఫీట్ల నుంచి 200 మెట్రిక్ క్యూబిక్ ఫీట్లకు చేరుతుందని అంచనాలు వేశారు.


## ఆగుతూ సాగుతున్న పనులు..

ముఖ్యంగా మురికి నీరు చెరువులో కలువకుండా డైవర్ట్ చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం అధికారుల నిర్లక్ష్యం కారణంగా అటకెక్కింది. ఆగుతూ సాగుతున్న పనులతో ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఇప్పటి వరకు నగరంలో భారీ వర్షం పడకపోవడంతో నగర వాసులంతా ఊపిరి పీల్చుకుంటున్నారు. ప్రకృతి ప్రకోపించి భారీ వర్షాలు నమోదైతే ఎప్పటిలాగే లొతట్టు ప్రాంతాలన్నీ ముంపుకు గురికాక తప్పదు. బొందివాగు నాలా ద్వారా వచ్చే వర్షపు నీటిని భద్రకాళి చెరువులోకి పంపేందుకు ఒకే గేటును ఏర్పాటు చేయడంద్వారా భారీ మొత్తంలో వచ్చిన వర్షపు నీరు చుట్టు పక్కల ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. అలా కాకుండా కట్ట పొడుగునా కనీసం నాలుగైదు గేట్లు ఏర్పాట్లు చేయడం ద్వారా వర్షపు నీటిని నేరుగా చెరువులోకి పంపడం ద్వారా లొతట్టు ప్రాంతాలను ముంపునుంచి రక్షించవచ్చని భావించినా ఆ దిశగా అడుగులు పడడంలేదు.

# జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి

- అందుకు జిల్లా స్థాయి కమిటీని నియమించాలి
- కలెక్టర్ కు టీడబ్ల్యూజేఎఫ్ నేతలు విజ్ఞప్తి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టీవీ రాజు గౌడ్, అంతడపుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కు వినతిపత్రం అందజేశారు. వర్కింగ్ జర్నలిస్టులు వృత్తిలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారంటూ కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు. చాలా మంది పాత్రికేయులు దారిద్ర్యరేఖకు దిగువన ఉండి ఈ వృత్తిని కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాలు, వివిధ అభివృద్ధి పనులను కథనాల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్తూ జర్నలిస్టులు తమ వృత్తి ధర్మాన్ని నెరవేరుస్తున్నారని గుర్తుచేశారు. ఈ క్రమంలో తమ సమస్యలు, హక్కులను ప్రభుత్వం దృష్టికి, ముఖ్యంగా కలెక్టర్ స్థాయిలో పరిష్కరించాలని కోరారు. జిల్లాలో గత 20 ఏళ్ళుగా జర్నలిస్టులకు నివేషణ స్థలాలు ఇవ్వలేదన్నారు. కేవలం రెండు జర్నలిస్టు సొసైటీలకు ప్రభుత్వం భూమి కేటాయించిందని గుర్తు చేశారు. అది కూడా అన్యాక్రాంతం అవుతుందని దాన్ని కాపాడాలని కలెక్టర్ ని కోరారు. అలాగే గత 20 ఏళ్లుగా ఏ సొసైటీలో లేని జర్నలిస్టులకు కూడా నివేశన స్థలాలు అందజేయాలన్నారు. ఇప్పటివరకు పూర్తయిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను వర్కింగ్ జర్నలిస్టులకు కేటాయించాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులను అందజేయాలన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, జర్నలిస్టులపై దాడుల నియంత్రణకు జిల్లా స్థాయి కమిటీని నియమించాలని కోరారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు. స్పందించిన కలెక్టర్ స్నేహ శబరిష్ ప్రభుత్వం గతంలో రెండు సొసైటీలకు కేటాయించిన భూమిని అన్యక్రాంతం కాకుండా ఆర్డీవోలతో సమావేశం ఏర్పాటు చేసి కాపాడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ హనుమకొండ జిల్లా కోశాధికారి ఈసంపెల్లి రమేష్, సంయుక్త కార్యదర్శి ఈర్ల తిలక్, పశ్చిమ నియోజకవర్గం అధ్యక్షులు గిరెడ్డి అనిల్ రెడ్డి, కార్యదర్శి దామెర వెంకటేష్, సంపత్ రెడ్డి, అంకేశ్వరపు రాజేందర్ పాల్గొన్నారు.



# అమెరికా లయన్స్ క్లబ్ గవర్నర్‌గా చంద్రశేఖర్ ఆర్య

- ఓర్లాండోలో పది రోజుల శిక్షణ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అంతర్జాతీయ లయన్స్ క్లబ్ జిల్లా 320ఎఫ్ కు 2025-26 సంవత్సరానికి గవర్నర్‌గా డాక్టర్ కె.చంద్రశేఖర్ ఆర్య ఎన్నికయ్యారు. అమెరికాలోని ఓర్లాండోలో జరిగిన 107వ లయన్స్ అంతర్జాతీయ కన్వెన్షన్స్ సందర్భంగా గత పది రోజులుగా లయన్స్ శిక్షణ శిబిరంలో ఆయన శిక్షణ పొంది, ఈ నెల 17న ప్రమాణ స్వీకారం చేశారు. డాక్టర్ కె.చంద్రశేఖర్ ఆర్య గవర్నర్‌గా ఎన్నికైన సందర్భంగా 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందనా పూర్ణచందర్, రంగశాయిపేటలోని వీరభద్ర పరపతి సంఘం అధ్యక్షుడు బక్కి వీరసాయి ప్రసాద్, మిత్ర పరపతి సంఘం అధ్యక్షుడు చిగిరి కుమారస్వామి, జై హనుమాన్ పరపతి సంఘం అధ్యక్షుడు పోషాల మల్లికార్జున్, జనతా పరపతి సంఘం అధ్యక్షుడు కెడల మల్లేశం, తెలంగాణ పరపతి సంఘం అధ్యక్షుడు శంకేసి లింగమూర్తి, సుభాష్ చంద్రబోస్ పరపతి సంఘం అధ్యక్షుడు శంకేసి శ్రీనివాసమూర్తి, దామర గుట్టల వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బక్కి రవీందర్, లక్ష్మీ గణపతి పరపతి సంఘం అధ్యక్షుడు బూర సంతోష్, స్థానిక న్యాయవాది షేర్ల అనిల్ కుమార్, రావుల బాలరాజు, కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నరసింహా రాములు, వ్యాయామ ఉపాధ్యాయులు బొలిశెట్టి కమలాకర్, పాకాల రవి, గంగరాజు బాలరాజు, చిగిరి పూర్ణ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



# రేషన్ కార్డుల పంపిణీ

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** మంత్రి కొండ సురేఖ చేతుల మీదగా 42వ డివిజన్ కు చెందిన బూర నవ్యకు నూతన రేషన్ కార్డును అందించినట్లు కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ తెలిపారు. శుక్రవారం ఎల్బీనగర్ లోని ఏవన్ కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన ఇందిరా మహిళ శక్తి సంబురాలు, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి సురేఖతోపాటు నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, 42 వడివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ పాల్గొన్నారు. డివిజన్ లోని అర్హులైన పేద కుటుంబాల వారికి రేషన్ కార్డులు మంజూరు అయ్యాయని, వాటిని త్వరలోనే అర్హులందరికీ అందించడం జరుగుతుందని గుండు చందన పూర్ణచందర్ తెలిపారు.